





# ప్రకృతిని ప్రత్యేకంగా..

**ప్రకృతి (నేచర్) ఫొటోగ్రఫీ ప్రత్యేకమైంది. అందులోనూ మొక్కలు, లేలేత చిగుర్లు, పూల రేకులను కెమెరాల్లో బంధించడం.. మరింత ప్రత్యేకంగా నిలుపుతుంది. విభిన్న ఆకృతుల్లో ఉండే చెట్ల ఆకులు, వాటిపైనుంచి జాలువారే నీటి బిందువులను కలుపుకొంటూ.. ప్రకృతి సౌందర్యాన్ని 'క్లిక్' మనిపించడం.. అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది. కేవలం మొబైల్ ఫోన్‌తో, ప్రకృతిలో కనిపించే అతి చిన్న వివరాలను ఫొటోలుగా మలిచే మొక్కల మాక్రో షాట్‌లను ఎలా తీయాలో తెలుసుకుందాం.**

### క్లోజప్ ప్లాంట్ ఫొటోగ్రఫీ ఎందుకు?

- మొక్కలు, వాటి ఆకులు, పూలపై ఉండే ఆకృతులు విభిన్నంగా ఉంటాయి. వివిధ రంగుల్లో కనువిందు చేస్తుంటాయి. వాటిని మాక్రో ఫొటోగ్రఫీతో మరింత హైలైట్ చేయొచ్చు.
- ప్రకృతి అందాలను మరింత ప్రత్యేకంగా క్యాప్చర్ చేయడానికి.
- ఖరీదైన కెమెరా గేర్ అవసరం లేకుండానే మీ ఫొటోగ్రఫీ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చు.

### కెమెరా సెట్టింగ్స్

ఆధునిక స్మార్ట్‌ఫోన్లు చాలావరకు శక్తిమంతమైన మాక్రో లెన్స్‌లతో వస్తున్నాయి. ఇవి మొక్కల్లోని అతిసూక్ష్మ వివరాలను కూడా గొప్పగా క్యాప్చర్ చేస్తాయి. అయితే, మీ ఫొటోలను మరింత మెరుగుపరచడానికి ఈ సెట్టింగ్స్ ఫాలో అయితే చాలు.

- **మాక్రో మోడ్ (అందుబాటులో ఉంటే) :** క్లోజప్ షాట్స్ కోసం మీ స్మార్ట్‌ఫోన్ కెమెరాలో 'మాక్రో మోడ్'ను ఎనేబుల్ చేసుకోండి.
- **ఫోకస్ :** మీరు హైలైట్ చేయాలనుకుంటున్న మొక్కలు, పువ్వుల డీటెయిల్స్‌పై ఫోకస్ చేయండి.
- **హెచ్‌డీఆర్ మోడ్ :** షాడోస్ – హైలైట్స్‌ను బ్యాలెన్స్ చేయడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా ఆరుబయట, వెలుతురు ఎక్కువగా ఉండే వాతావరణంలో..
- **ఎక్స్‌పోజర్ :** ఫొటోలు మరీ ప్రకాశవంతంగా ఉంటే.. మీరు కోరుకున్న డీటెయిల్స్ సరిగ్గా కనిపించవు. కాబట్టి, ఎక్స్‌పోజర్ లెవెల్స్‌ను కొద్దిగా తగ్గించండి.
- **ప్రో/ మాన్యువల్ మోడ్ :** ఫొటోగ్రఫీపై పూర్తి నియంత్రణ కోసం.. ISO, షట్టర్ స్పీడ్‌ను సర్దుబాటు చేయడానికి ఈ మోడ్ చాలా ఉపయోగపడుతుంది.
- **ISO :** తక్కువ ISO (100–200)తో ఫొటోలు తీయండి. దీంతో డిజిటల్ నాయిస్ తగ్గుతుంది. ఫొటోలు మరింత షార్ప్‌గా వస్తాయి.
- **ప్రోటిప్ :** మీ ఫోన్లో మాక్రో మోడ్ లేకపోతే.. డీటెయిల్స్ షార్ప్ అయ్యేదాకా కెమెరాను మీ సబ్జెక్ట్ దగ్గరిదాకా తీసుకెళ్లండి. దూరంగా ఉండి 'డిజిటల్ జూమ్' చేయకండి. ఇది.. మీ ఫొటోల నాణ్యతను తగ్గిస్తుంది.

### లైటింగ్

మొక్కల క్లోజప్ ఫొటోలు మరింత షార్ప్‌గా రావాలంటే.. లైటింగ్ చాలా అవసరం. కాబట్టి, కింది సూచనలు పాటిస్తే సరి.

- **నేచురల్ లైట్ :** ఆరు బయట ఫొటోలు తీయాలనుకుంటే.. గోల్డెన్ అవర్ (ఉదయం 7గం.– 9గం. వరకు, సాయంత్రం 4గం. – 6 గం. వరకు) మంచి సమయం. ఈ సమయంలో వచ్చే మృదువైన, బంగారు వర్ణపు కాంతి.. మొక్కల టెక్చర్‌ను మరింత పెంచుతుంది.
- **క్లౌడీ డేస్ :** మబ్బులు పట్టిన ఆకాశం.. మధ్యాహ్నపు వేళ ఆహ్లాదంగా కనిపిస్తుంది. ఇలాంటి సమయంలో మొక్కల ఫొటోలు మరింత అందంగా వస్తాయి.
- **బ్యాక్‌లైటింగ్ :** మొక్కల వెనుక నుంచి వచ్చే సూర్య రశ్మి.. ఆయా మొక్కలను అద్భుతంగా చూపిస్తుంది.
- **కృత్రిమ కాంతి :** ఇండోర్ షాట్ల కోసం ఎల్ఈడీ రింగ్ లైట్, సాఫ్ట్‌బాక్స్ లేదా డెస్క్ ల్యాంప్, తెల్లటి రిఫ్లెక్టర్లు వాడండి. ఇవి మొక్కలు, పువ్వుల్లోని డీటెయిల్స్‌ను మరింత హైలైట్ చేయడానికి ఉపయోగపడతాయి.
- **ప్రో టిప్ :** మొబైల్ కెమెరా ఫ్లాష్‌ను ఉపయోగించకండి. ఎందుకంటే.. ఫ్లాష్‌లైట్ నుంచి వచ్చే కాంతి హార్డ్‌గా ఉంటుంది. ఆకులు, పువ్వుల్లోని డీటెయిల్స్‌ను దెబ్బతీస్తుంది.



### కంపోజిషన్ టిప్స్

మంచి కంపోజిషన్‌లో తీసే ఫొటోలు.. కళాత్మకంగా వస్తాయి. దృశ్యపరంగా ఆకర్షణీయంగానూ కనిపిస్తాయి.

- **రూల్ ఆఫ్ థర్డ్స్ :** మీ సబ్జెక్ట్‌ను ఫ్రేమ్ మధ్యలో ఉంచడం మంచిది. ఈ బ్యాలెన్స్‌డ్ కంపోజిషన్.. మీ ఫొటోను మరింత సహజంగా చూపిస్తుంది.

**యాంగిల్స్‌తో ప్రయోగం :**

**లో యాంగిల్ షాట్‌లు :** మొక్కను లో యాంగిల్ (కింది నుంచి) చూడటం వల్ల.. అంతెత్తున, అద్భుతంగా కనిపిస్తుంది.

**టాప్ యాంగిల్ షాట్‌లు :** మొక్కలను పైనుంచి చూస్తే విభిన్నంగా కనిపిస్తాయి. వాటి లేలేత చిగుర్లను ఫొటోలు తీయడానికి టాప్ యాంగిల్‌లో ఫొటోలు తీయండి.

**టాప్ డౌన్ షాట్‌లు :** ఆకు నమూనాలు, పువ్వులను ఫొటోలు తీయడానికి పనిచేస్తుంది.

- **ఆబ్జెక్ట్స్‌ను చేర్చండి :** మీ సబ్జెక్ట్ (ఆకులు/ పువ్వులు) మరింత ప్రత్యేకంగా కనిపించాలంటే.. వాటిపై నీటి బిందువులు/ కీటకాలను చేర్చండి. ఆకుల నుంచి జాలువారే వర్షపు చినుకులు.. పువ్వులపై వాలే తేనెటీగలు, సీతాకోకచిలుకలు, చీమలు.. మీ ఫొటోకు ప్రాణం పోస్తాయి.
- **ప్రో టిప్ :** నీటి బిందువుల షాట్‌ల కోసం స్ప్రే బాటిల్‌తో మొక్కపై తేలికగా నీటిని పిచికారీ చేయండి.

### ఎడిటింగ్ యాప్‌లు

క్లోజప్ ప్లాంట్ ఫొటోగ్రఫీలో వివరాలు, రంగులను మరింత మెరుగుపరచడానికి ఫొటోలను ఎడిటింగ్ చేయండి. అందుకోసం కింది యాప్‌లు వాడండి.

- Snapseed : బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్, షార్ప్‌నెస్‌ను సర్దుబాటు చేయడానికి.
- Adobe Lightroom Mobile : క్లారిటీ – టెక్చర్ వివరాలను మరింత మెరుగుపరచడానికి.
- VSCO : ఫొటోలకు ఆర్టిస్టిక్ ఫిల్టర్లను జోడించడానికి.
- **ప్రో టిప్ :** ఫొటోల్లో డీటెయిల్ ప్రత్యేకంగా కనిపించేందుకు షార్ప్‌నెస్, కాంట్రాస్ట్‌ను కొద్దిగా పెంచండి. అతిగా సవరిస్తే ఫొటోలు ఎబ్బెట్టుగా కనిపిస్తాయి.

ఒకవేళ మీ స్మార్ట్‌ఫోన్‌లో మాక్రో లెన్స్ లేకపోతే.. క్లోజప్ షాట్స్ కోసం క్లిప్–ఆన్ మాక్రో లెన్స్‌ని ఉపయోగించండి. ఫోకస్, లైటింగ్‌తోపాటు కంపోజిషన్‌పై పట్టు సాధించడం ద్వారా.. నిత్యం చూసే మొక్కలనే అద్భుతమైన కళాఖండాలుగా మార్చవచ్చు. ఫోన్‌ను తీసుకోండి.. మొక్కల అందాన్ని అన్వేషించండి. ప్రకృతిలో ఉండే చిన్నచిన్న అద్భుతాలను 'క్లిక్' మనిపించడం మొదలుపెట్టండి. ■

... ఆడెపు హరికృష్ణ